సాక్షి
అనంతపురం

సోమవారం । 26 । ఆగస్టు । 2024



గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

జిల్లాలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఆదివారం పలు చోట్ల చిన్ని కృష్ణులు నందడి చేశారు.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/23.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.



ప్రత్యేక రక్షణ చట్టాలు చేయాలి

కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన సంఘటన దారుణం. ఇలాంటి దాడికి పాల్పడిన దోషులకు సరైన శిక్ష విధించాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. మహిళా వైద్యుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టాలు చేయాలి. అనారోగ్యంతో, ప్రమాద సమయాల్లో ఆస్పత్రులకు వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ లేకపోవడం బాధాకరం. ఆస్పత్రుల్లో అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాలి.

– గీతాభార్గవి, మెడికల్ ఆఫీసర్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ, బొమ్మనహాళ్ మండలం



డాక్టర్లపై దౌర్జన్యం చేస్తే ఎలా?

సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో ఆందోళనకరమైన పరిస్థితులు చూస్తున్నాం. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని పరితపిస్తుంటాం. ఒక్క రోగికి పదుల సంఖ్యలో సహాయకులు వస్తుంటారు. కొందరు ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటారు. ఇటీవల ఓ వ్యక్తి మద్యం మత్తులో వచ్చి మాపై దౌర్జన్యం చేశాడు. దీంతో అర్ధరాత్రి టూటౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చింది. డాక్టర్లు, సిబ్బంది భద్రతకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ రీనాకుమారి, సీఎంఓ, సర్వజనాస్పత్రి



న్యూస్‌రీల్

లక్ష్మీనృసింహుని సేవలో హైకోర్టు జడ్జి



పెన్నహోబిలంలో హైకోర్టు జడ్జి సుజాతకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు

ఉరవకొండ: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత ఆదివారం సందర్శించారు. పెన్నహోబిలం ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌చార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు జడ్జి శ్రీవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈఓ విజయ్ కుమార్ శ్రీవారి తీర్థప్రసాదాలను అందించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.

• రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయంగా ప్రసిద్ధి గాంచిన బూదగవి ఆలయంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామిని కూడా హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత దర్శించుకున్నారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరి బసవరాజేంద్రస్వామి ఆశీస్సులు పొందారు. గవిలో వెలసిన స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జడ్జిని గవిమఠం ఉత్తరాధికారి, ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య, కమిటీ అధ్యక్షులు చిరంజీవి, సుధాకర్, మహేంద్రగౌడ్‌లు ఘనంగా సత్కరించి స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

'లఖ్‌పతి దీదీ'తో మహిళల అభ్యున్నతి



మెగా చెక్కు విడుదల చేస్తున్న ఎంపీ, ఇన్‌చార్జ్ కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్: మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం లఖ్‌పతి దీదీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అన్నారు. పథకం కింద మహిళలను సత్కరించే కార్యక్రమాన్ని ఆదివారం మహారాష్ట్రలోని జెల్గాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని అనంతపురం కలెక్టరేట్ నుంచి ఎంపీ, ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంగా పథకాన్ని ప్రధాని తీసుకొచ్చారన్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 887 స్వయం సహాయక సంఘాల సభ్యులకు లఖ్ పతి దీదీ పథకం కింద రూ.80.56 కోట్ల బ్యాంకు రుణం అందిస్తున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మెగా చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులు విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, ఏపీడీ ఈశ్వరయ్య, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆఫ్రికాకు మన ప్రకృతి



జాంబియాకు పయనమైన లక్ష్మానాయక్ బృందం

అనంతపురం అగ్రికల్చర్: మన ప్రకృతి వ్యవసాయం ఖండాంతరాలు దాటుతోంది. జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయ విభాగం చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ (సీటీఐఓ) వి.లక్ష్మానాయక్ నేతృత్వంలో ఆరుగురితో కూడిన బృందం 15 రోజుల పర్యటనకు ఆదివారం జాంబియా దేశానికి బయలుదేరింది. ఈ సందర్భంగా 'సాక్షి'తో లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఆఫ్రికాలోని జాంబియా పేద దేశమన్నారు. ఆ దేశంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, తక్కువ భూమిలో వివిధ రకాల పంటల సాగు అంశాల గురించి అవగాహన కల్పించి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. తనతో పాటు లైజనింగ్ ఆఫీసర్ షేక్ ఇర్ఫాన్, ఛాంపియన్ ఫార్మర్స్ కింద కుమ్మర రవిచంద్ర, వాల్మీకి శివశంకర్, రుద్రపాటి సుకన్య, పుట్టగోసుల సుధాకర్ తదితరులు జాంబియాకు వెళుతున్నట్లు తెలిపారు.

వణికిస్తున్న విషజ్వరాలు



ఈ ఫొటోలో కన్పిస్తున్న వ్యక్తి పేరు చంద్రమౌళి. అనంతపురం రూరల్ నందమూరి నగర్ వాసి. కొన్ని రోజులుగా ఇతను జ్వరంతో బాధపడుతున్నాడు. ఇటీవల సర్వజనాస్పత్రికి రాగా, వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించారు. మలేరియా అని నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.



ఈ బాలుడి పేరు బాబు. వయసు 10 సంవత్సరాలు. శెట్టూరు మండలంలోని రంగయ్య పాళెం గ్రామానికి చెందిన ఇతను కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇటీవల పరీక్షలు నిర్వహించగా, డెంగీ సోకినట్లు నిర్ధారణైంది. ప్రస్తుతం సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో బాలుణ్ని ఉంచి చికిత్సలు అందిస్తున్నారు.



అనంతపురం సర్వజనాస్పత్రిలో జ్వరపీడితులతో నిండిపోయిన ఓ వార్డు

- విస్తరిస్తున్న సీజనల్ వ్యాధులు
- జిల్లాలో ఇప్పటికే వంద దాటిన డెంగీ కేసులు
- రోగులతో కిటకిటలాడుతున్న సర్వజనాస్పత్రి
- పారిశుధ్య నిర్వహణ కరువై ప్రజల అవస్థలు

అనంతపురం మెడికల్: జిల్లా ప్రజలను విషజ్వరాలు వణికిస్తున్నాయి. అనంతపురం అర్బన్, రూరల్, ఆత్మకూరు, శింగనమల, ఉరవకొండ, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో వందకుపైగా డెంగీ కేసులు నమోదైనట్లు తెలిసింది. పేద ప్రజలు ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

70 శాతం జ్వరపీడితులే..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వివిధ మునిసిపాలిటీ అధికారుల వైఫల్యంతో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. అనంతపురం బోధనాస్పత్రిలోని మెడిసిన్ మేల్, ఫీమేల్ ఓపీకి రోజూ సరాసరి 300 మంది వరకు వస్తే అందులో 200కు పైగా జ్వరపీడితులే ఉంటున్నారు. బోధనాస్పత్రి చిన్నపిల్లల వార్డులోని మూడు యూనిట్లలో అడ్మిషన్‌లో ఉన్న వారిలో 37 మంది జ్వరంతో బాధపడుతున్నారు. పలువురు డెంగీతో అడ్మిషన్‌లో ఉన్నారు. దీంతో పాటు అనంతపురం సీడీ ఆస్పత్రి, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఏరియా ఆస్పత్రులు, మిగిలిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు రోగులతో కిటకిటలాడుతున్నాయి. అయితే, ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం జ్వరం కేసులే లేవంటూ బుకాయిస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. గత వారం రోజుల్లో డెంగీ, మలేరియా కేసులు పది కూడా నమోదు కాలేదంటూ మలేరియా విభాగం జిల్లా అధికారి ఓబులు చెప్పడం గమనార్హం.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం..

పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతోనే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దోమలు, పందులు స్వైర విహారం చేస్తూ రోగాలు వ్యాపింపజేస్తున్నాయి. అనంతపురం నగరంలోని 49వ డివిజన్ వడ్డే వారి కాలనీని ఇటీవల వరద చుట్టుముట్టింది. దీంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది.



అనంతపురం రంగస్వామి నగర్‌లో జనావాసాల నడుమ పేరుకుపోయిన చెత్తకుప్ప

కాలువలు కంపుకొడుతున్నాయి. జనావాసాల మధ్య కుప్పలను తొలగింపజేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో పాటు పాతూరు, ఉమానగర్, రాణినగర్, మున్నానగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలు చిన్నపాటి కొండలను తలపిస్తున్నా తొలగించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇక.. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫాగింగ్, స్ప్రేయింగ్ అటకెక్కింది. దీంతో సామాన్య ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం



చెత్త సేకరణకు పారిశుధ్య సిబ్బంది రావడం లేదు. చెత్తను ఎన్ని రోజులు ఇంట్లో ఉంచాలి?. దోమలతో ఎక్కడ అనారోగ్యం బారిన పడతామోనని భయమేస్తోంది. జ్వరాలు ప్రబలుతున్న సమయంలో దోమలు పెరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఫాగింగ్, స్ప్రేయింగ్ నిరంతరం చేయించాలి.

– లక్ష్మిదేవి, ఉమానగర్, అనంతపురం

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



జిల్లాలోని మునిసిపాలిటీల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్లను ఆదేశించాం. అనంతపురంలోనూ చెత్త సేకరణ, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టేలా చూస్తున్నాం. నగరంలో రోజూ 120 నుంచి 130 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. షిఫ్టుల ప్రకారం డివిజన్లలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. ప్రజలు సైతం ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

– పీవీవీఎస్ మూర్తి, మునిసిపల్ ఆర్డీ

నియంత్రణలో డెంగీ, మలేరియా

జిల్లాలో డెంగీ, మలేరియా వ్యాధులు నియంత్రణలోనే ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి కేవలం 52 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయి. మలేరియా కేసులు పెద్దగా నమోదు కాలేదు. దోమకాటు నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపడుతున్నాం. మునిసిపాలిటీలు, ఇతర ప్రాంతాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్, యాంటీ లార్వా పద్ధతులను అనుసరించి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఓబులు, జిల్లా మలేరియా అధికారి

పీహెచ్‌సీకి సెలవు.. గొర్రెల నెలవు



పీహెచ్‌సీకి తాళం వేసిన దృశ్యం



పీహెచ్‌సీ నుంచి బయటకు వెళుతున్న గొర్రెల మంద

తాడిపత్రి రూరల్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కంటే మండలంలోని చుక్కలూరు ఆరోగ్య కేంద్రం భిన్నం. ఎందుకంటే ఆదివారం అయితే చాలు ఆస్పత్రికి తాళం పడుతోంది. వైద్యం కోసం వచ్చే రోగుల కంటే తమకు అనధికార సెలవే ముఖ్యం అన్న రీతిలో ఇక్కడి వైద్యులు వ్యవహరిస్తున్నారు. ఉదయం 11 గంటలకే ఆరోగ్య కేంద్రానికి తాళం వేస్తున్నారు. సాధారణంగా డ్యూటీ డాక్టర్ లేరంటే నర్సు ఉండాలి. కానీ వారందరు కలిసి మూకుమ్మడి సెలవు అన్నట్టు వెళ్లారు. ఆరోగ్య కేంద్రానికి తాళం వేయడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు నిరాశతో తిరిగి వెళ్లారు.

పీహెచ్‌సీలో గొర్రెల మంద..

చుక్కలూరు ఆరోగ్య కేంద్రంలో ఆదివారం గొర్రెల మంద కనిపించింది. ఆరోగ్య కేంద్రం బిల్డింగ్‌కు తాళం వేసినా ప్రధాన గేటు తెరిచి ఉండటంతో కాపలాదారులు వందల సంఖ్యలో గొర్రెలను అందులోకి మేపడానికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీ ఆవరణలోని గడ్డితో పాటు అక్కడ ఉన్న చెట్లపై గొర్రెల మంద పడి ఆకులను తినడం కనిపించింది. కేవలం నాలుగడుగులు ఉన్న మొక్కలపై కూడా కాళ్లు పెట్టి మరి ఆకులను ఖాళీ చేయడం కనిపించింది. ఆస్పత్రికి తాళం వేయడంపై మెడికల్ ఆఫీసర్ లావణ్యను వివరణ కోరేందుకు 'సాక్షి' సెల్‌ఫోన్‌లో ప్రయత్నించినా ఆమె లిఫ్ట్ చేయలేదు.

తొలగింపు తూచ్..!

- కక్కలపల్లి కాలనీ 14/2 సర్వే నంబరులో మళ్లీ వెలసిన లేఔట్
- చక్రం తిప్పిన టీడీపీ మండల స్థాయి ద్వితీయ శ్రేణి నాయకుడు
- లేఔట్‌ను తొలిగించినట్లు అధికారులకు ఉత్తుత్తి నివేదికలు



14/2 సర్వే నంబరులో అధికారులు తొలగించామని చెబుతున్న లేఔట్ ఇదే

రాప్తాడురూరల్: కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని 14/2 సర్వే నంబరులో లేఔట్ మళ్లీ వెలసింది. లేఔట్‌ను తొలిగించినట్లు అధికారులకు కిందిస్థాయి సిబ్బంది ఉత్తుత్తి నివేదికలు అందించినట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతకు భారీగా తాయిలం అందడంతో అక్రమ లేఔట్‌కు గుట్టుగా పనులు చక్కబెడుతున్నట్లు సమాచారం.

తొలగించామంటూ ఫొటోలు..

కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలో ఏర్పాటవుతున్న ఈ లేఔట్‌పై మీడియాలో ప్రచారం కావడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక బృందం పరిశీలించి లేఔట్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు నిర్ధారించారు. స్వయంగా జిల్లా పంచాయతీ అధికారి ఈ లేఔట్‌ను తొలగించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇటీవల రంగంలోకి దిగిన కిందిస్థాయి సిబ్బంది జేసీబీని తెప్పించి ముందు వైపు నాలుగు సిమెంటు పెళ్లలు తొలగించారు. లోపల మాత్రం ఒక్క రాయిని కూడా ముట్టుకోకుండానే అంతా తొలగించినట్లు ఫొటోలకు ఫోజులిచ్చారు.

డీల్ కుదరడంతో మళ్లీ..

అయితే, తొలగించిన స్థానంలోనే మళ్లీ లేఔట్ వెలిసింది. దీనికి సంబంధించి పెద్దమొత్తంలోనే ముడుపుల బాగోతం నడిచినట్లు తెలిసింది. లేఔట్ నిర్వాహకులు, అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత మధ్య డీల్ కుదిరింది. ఇందుకోసం రూరల్ మండలానికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుడు చక్రం తిప్పాడు.ముఖ్య నేతకు రూ.1.30 కోట్లు ఇచ్చేలా మాట్లాడుకున్నట్లు తెలిసింది . దీంతో యథాస్థానంలోనే లేఔట్ వెలిసింది.

అహుడా హెచ్చరిక నోటీసు..

తాజాగా అహుడా అధికారులు తమ పరిధిలో 23 అక్రమ లేఔట్లను గుర్తించారు. అందులో ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలు నిషిద్ధం అంటూ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లు కావంటూ స్పష్టం చేశారు. ఎలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరని పేర్కొన్నారు. స్థల యజమానులు, దేవలపల్లిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. అహుడా ప్రకటించిన 23 అక్రమ లేఔట్ల జాబితాలో 14/2 సర్వే నంబరులోని లేఔట్ మొదటి స్థానంలోనే ఉండడం విశేషం. దీనిపై పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా మాట్లాడుతూ 'ఇటీవలే ఈ లేఔట్‌ను తొలగించాం. మళ్లీ వేసినట్లు తెలిసింది. దీనిపై అహుడా అధికారులకు ఫిర్యాదు చేశాం' అని తెలిపారు.

రియల్ ఢమాల్

- స్థిరాస్తి రంగంలో భారీగా పడిపోయిన క్రయ విక్రయాలు
- అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ మైనస్ వృద్ధి రేటే
- కూటమి ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ రంగం కుదేలు
- రిజిస్ట్రేషన్ శాఖకు భారీగా పడిపోయిన ఆదాయం
- వార్షిక లక్ష్యం రూ.469 కోట్లయితే నాలుగు నెలల్లో వచ్చింది రూ.63 కోట్లే
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఎప్పుడూ లేనంతగా గడ్డు పరిస్థితి

జిల్లాలో స్థిరాస్తి రంగం కుదేలైంది. కొత్త ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని, క్రయవిక్రయాలు ఊపందుకుంటాయని భావించిన పలువురికి చేదు గుళిక మింగినట్టయింది. ఏప్రిల్, మే మాసాల్లో ఎన్నికలు జరిగాయి కాబట్టి ఎలాగూ పెద్దగా లావాదేవీలు ఉండవని, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక భారీగా ఈ రంగం పుంజుకుంటుందని భావించిన వారి ఆశలు అడియాసలయ్యాయి. ఇళ్ల స్థలాలు కొనే నాథుడే కరువయ్యారు. గతంలో ఈ రంగంపై భారీగా పెట్టుబడులు పెట్టి భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని సామాన్యులు వాపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జూన్ 12న కూటమి సర్కారు కొలువుదీరింది. అక్కడి నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉండేది. కూటమి సర్కారు రాకతో గొడవలు, ఆక్రమణలు, బెదిరింపులు ప్రారంభమయ్యాయి. టీడీపీ నేతల అరాచకాల ప్రభావం స్థిరాస్తి రంగంపైనా పడింది. ఇళ్ల స్థలాలు కొనాలంటే మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలు భయపడుతున్నాయి. ఏ భూమి వెనుక ఎలాంటి వివాదముందో, ఎవరు దీని వెనుక ఉన్నారో అన్న భయం కొనుగోలుదారులను వెంటాడుతోంది. కొంతమంది టీడీపీ నాయకులు ఇలాంటి వివాదాల్లో తలదూర్చి భయపెడుతుండటంతో చాలామంది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రావడం మానేశారు.

భారీగా పడిపోయిన క్రయవిక్రయాలు..

జిల్లాలో మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో అనంతపురం, రూరల్ కార్యాలయాలు సర్కారుకు మంచి ఆదాయ వనరుగా ఉండేవి. జిల్లా కేంద్రానికి ఆనుకుని బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి ఉండటంతో సమీప ప్రాంతంలో స్థలాలు, ప్లాట్లపై భారీ లావాదేవీలు జరిగేవి. కానీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో నేడు వృద్ధి రేటు పడిపోయింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.



జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం

కొనే వాళ్లు లేరు

జిల్లాలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం దారుణంగా ఉంది. స్థలాలు అమ్మేవాళ్లున్నారు కానీ కొనేవాళ్లు ముందుకు రావడం లేదు. దీంతో పెట్టుబడులు పెట్టిన నా లాంటి చాలామంది వ్యాపారులు ఇబ్బందుల్లో ఉన్నారు. రెండుమూడు నెలల నుంచి స్థలాల కొనుగోళ్లు, అమ్మకాలు అసలే జరగడం లేదు.

– అల్లాబకాష్,రియల్ ఎస్టేట్ వ్యాపారి,అనంతపురం

జిల్లాలోని వివిధ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గత నాలుగు మాసాల్లో వృద్ధి రేటు ఇలా

రిజిస్ట్రేషన్ కార్యాలయం	వృద్ధి రేటు
గుత్తి	-8.06
గుంతకల్లు	-20.11
కళ్యాణదుర్గం	-16.04
కణేకల్లు	-22.55
పామిడి	-35.11
రాయదుర్గం	7.60
శింగనమల	-8.50
తాడిపత్రి	-29.03
ఉరవకొండ	-19.41
యాడికి	-47.48
అనంతపురం అర్బన్	-8.06
అనంతపురం రూరల్	3.84

క్లుప్తంగా

అగ్రి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



ఉమ్మడి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

అనంతపురం అగ్రికల్చర్: అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీసు అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. ఆదివారం స్థానిక కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో రెండు జిల్లాల ఉద్యోగులు హాజరై నూతనంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా ఎస్.బాలాజీనాయక్, కోశాధికారిగా కేఎస్ ప్రాణేష్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సీవీ రమణారెడ్డితో పాటు ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేశులు, ఎం.రాజగోపాల్, ఎ.రంగస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జి.నరసింహులు, ఎస్.సల్మాసబీర్‌అంజుమ్, జాయింట్ సెక్రటరీలుగా పి.ప్రభాకర్, టి.వీరేష్‌బాబు, కె.హఫీజ్, ఎ.పద్మావతి, సభ్యుడిగా బి.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.పుల్లయ్యను ఎంపిక చేశారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రవికుమార్, ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ నాయకులు హాజరయ్యారు. నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతి దూలం లాగుతున్న వృషభాలు

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంటలో నూతనంగా నిర్మించిన వాల్మీకి ఆలయ ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించిన వృషభాల బలప్రదర్శన హోరాహోరీగా సాగింది. వైఎస్సార్, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 8 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. వైఎస్సార్ జిల్లా చౌటపల్లికి రైతు మార్థల చంద్ర ఓబులరెడ్డి వృషభాలు 3 వేల అడుగుల దూరం రాతి దూలాన్ని లాగి మొదటిస్థానంలో నిలిచాయి. ఇదే రైతుకు చెందిన మరో జత వృషభాలు రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా పీఆర్ పల్లికి రైతు నాగయ్య వృషభాలు మూడో స్థానం, గార్లదిన్నెకు చెందిన రైతు రామాంజనేయులు వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



భద్రత కల్పించాలి

నా కుమార్తె కూడా డాక్టరే. కోల్‌కతా ఘటన తర్వాత నాలాంటి తల్లుల్లో అభద్రతాభావం పెరిగింది. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మహిళా వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది సేవలందిస్తుంటారు. అలాంటి వారికి పూర్తి స్థాయి భద్రత కల్పించాలి. ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో మౌలిక వసతులు కల్పించాలి. భద్రతా ప్రమాణాలు మెరుగు పరచాలి. రాత్రి పూట విధుల్లో ఉన్న వారికి రక్షణగా పోలీసు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– జమీల, ఏపీఎన్‌జీఓ నాయకురాలు, అనంతపురం



ప్రశాంతత లేదు

అత్యవసర విభాగం, వార్డుల్లో రోగులతో పాటు వారి సహాయకుల కారణంగా ప్రశాంతత లేకుండా పోతోంది. ప్రధానంగా క్యాజువాలిటీలో పదుల సంఖ్యలో ఒకేసారి వచ్చేస్తారు. ఆ సమయంలో వారి ప్రవర్తన కారణంగా అభద్రత వాతావరణం నెలకొంటోంది. సక్రమంగా విధులు కూడా నిర్వర్తించలేం. ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చేయాలి. ఇందుకు సంబంధించి పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ తేజ, పీజీ సర్జరీ విభాగం విద్యార్థి, అనంతపురం బోధనాస్పత్రి



నేరస్తులను కఠినంగా శిక్షించాలి



పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో కొనసాగుతున్న ర్యాలీ

అనంతపురం అర్బన్: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి, హత మార్చిన కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని పౌర చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ డి.రాఘవేంద్ర డిమాండ్ చేశారు. వైద్యురాలి ఘటనను ఖండిస్తూ ఆదివారం అనంపురంలోని టవర్ క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడారు. వైద్యురాలి ఘటనలో దోషులుగా ఉన్నవారందరినీ గుర్తించి శిక్షించాలన్నారు. ఇంటర్నెట్‌లో పోర్నోగ్రఫీ, మద్యం, మాదకద్రవ్యాలు... మహిళలపై అత్యాచారాలకు కారణం అవుతున్నాయని, వీటిని తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎంబాషా, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మానవతా సంస్థ అధ్యక్షుడు తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, చైతన్య వేదిక నాయకులు తబ్రేజ్ ఖాన్, నాగముత్యాలు, విద్యార్థి, యువజన, మహిళ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాలింత రిస్క్... స్టాఫ్ రెస్క్యూ



బాలింతను తీసుకుని అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ వైపుగా వెళుతున్న స్టాఫ్ నర్సులు, సిబ్బంది

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆదివారం ఓ బాలింత ప్రాణాలు కాపాడేందుకు వైద్య సిబ్బంది పడిన తపనకు నిదర్శనమే ఈ చిత్రం. గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన బాలింత సుమతి ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో డ్యూటీ డాక్టర్ శ్రీలేఖ ఆదేశాలతో స్టాఫ్ నర్సులు, సిబ్బంది ఆగమేఘాలపై అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌కు తరలించారు. ఈ క్రమంలో వారు స్పందించిన తీరును పలువురు కొనియాడారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ప్రత్యామ్నాయం చూపని సర్కారు

- విస్తారంగా వర్షాలు కురిసినా విత్తు ఇవ్వని చంద్రబాబు ప్రభుత్వం
- కాగితాలకే పరిమితమైన 46,172 క్వింటాళ్ల విత్తనాలు



ఉలవ విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు ప్రత్యామ్నాయం చూపించకుండా చంద్రబాబు సర్కారు కాలం వెళ్లదీస్తోంది. 50 రోజుల తీవ్ర వర్షాభావ పరిస్థితుల తర్వాత ఎట్టకేలకు ఇటీవల ఉమ్మడి జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిసాయి. అయినా ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రశ్నార్థకమైంది.

ప్రతిపాదనలకే పరిమితం..

జూన్ 14 తర్వాత వర్షాలు లేక ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన పంటల సాగు పూర్తిగా తగ్గింది. వేసిన విత్తన పరిస్థితి కూడా అంతంత మాత్రంగా ఉన్న రెండు నెలల తర్వాత ఈ నెల 14 నుంచి మంచి వర్షాలు నమోదయ్యాయి. ఈ క్రమంలో కనీసం ప్రత్యామ్నాయం కింద పంటలు సాగు చేద్దామనుకుంటే చేతిలో విత్తనం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 80 శాతం రాయితీతో అనంతపురం జిల్లాకు 27,907 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 18,265 క్వింటాళ్ల మేర ఉలవలు, పెసలు, అలసందలు, కొర్రలు, జొన్నలు, మినుము విత్తనాలకు చేసిన ప్రతిపాదనలకు దిక్కుమొక్కు లేదు.

మంత్రి ప్రకటించినా....:

ఈ నెల 21న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అతి త్వరలోనే ప్రత్యామ్నాయ విత్తనం అందిస్తామని గొప్పగా ప్రకటించారు. అయితే విత్తనాల పూర్తీ ధరలు, ఇతర నిబంధనలు, పంపిణీ మార్గదర్శకాలు, విత్తన సేకరణ, సరఫరా పరిస్థితి ఇంకా తేలకపోవడం విశేషం. అనంతపురం జిల్లాలో 3.46 లక్షల హెక్టార్లకు గానూ 62 శాతం విస్తీర్ణంతో 2.15 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయగా... ఇంకా ప్రత్యామ్నాయం కింద 1.31 లక్షల హెక్టార్లు అంచనా వేశారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో కూడా 2.89 లక్షల హెక్టార్లకు గానూ 52 శాతంతో 1.60 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రాగా ప్రత్యామ్నాయం కింద 1.29 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. కానీ విత్తనం ఇవ్వడంలో కూటమి సర్కారు మీనమేషాలు లెక్కిస్తుండగా వ్యవసాయశాఖ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ మరింత జాప్యం చేస్తే భూమిలో తేమ ఆరిపోతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

సర్కారు సాయం నిల్..

గత ఐదేళ్లు జూన్, జూలై మాసాల్లోనే రైతు భరోసా కింద పెట్టుబడిసాయం, ఉచిత పంటల బీమా కింద పెద్ద మొత్తంలో పరిహారాన్ని అప్పటి జగన్ సర్కార్ అందజేసింది. 'అంతకు మించి' అంటూ ఆశలు రేకెత్తించి రైతుల ఓట్లు కొల్లగొట్టిన చంద్రబాబునాయుడు తీరా అధికారం చేపట్టిన తర్వాత రైతాంగంపై చిన్నచూపు చూస్తుండటంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు గురించి ఇప్పటి వరకూ చంద్రబాబు సర్కార్ స్పష్టత ఇవ్వలేదు. అలాగే ఉచిత బీమా కింద పరిహారం కూడా ఇవ్వకుండా దగా చేయడంతో అన్నదాతలు భగ్గుమంటున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

- ఏపీ మోడల్ స్కూల్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో వివిధ కారణాలతో 21 మంది మృతి చెందారని, వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద పోస్టింగ్ కల్పించాలంటూ ప్రభుత్వాన్ని ఏపీ మోడల్ స్కూళ్ల టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీమోడల్ స్కూళ్ల టీచర్ల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సమావేశానికి మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ద్వారా ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు రెగ్యులర్ నియామకమైనా ఇతర ప్రభుత్వ టీచర్లకు వర్తిస్తున్న సర్వీస్ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అమలు కావడంలేదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం మాట్లాడుతూ... మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ తెలుగు టీజీటీ పోస్టును పీజీటీగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య మాట్లాడుతూ అర్హులైన పీజీటీలకు టీజీటీలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. గౌరవాధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ మోడల్ స్కూళ్ల సిబ్బందికి ప్రభుత్వ సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజేయులు మాట్లాడుతూ... మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సూర్యుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

'తప్పుడు పద్ధతులను యూనియన్ సమర్థించదు'

అనంతపురం సెంట్రల్: తప్పుడు పద్ధతులను యూనియన్ ఎప్పటికీ సమర్థించదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'వయసు తగ్గించి .. విధుల్లోనే నక్కి' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. ఐసీడీఎస్ తాడిపత్రి ప్రాజెక్టులో కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో విధుల్లో కొనసాగుతున్న అంశంతో యూనియన్‌కు సంబంధం లేదన్నారు. ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారంలో వర్కర్లే కాకుండా అధికారుల హస్తం కూడా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడా జట్లతో నిర్వాహకులు

అనంతపురం సెంట్రల్: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళా, పురుషుల జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చేపట్టారు. మహిళా జట్టుకు గంగోత్రి (కణేకల్లు), వెంకటలక్ష్మి (విడపనకల్లు) సౌమ్య (ఖాదర్‌పేట), శివకన్య (ధర్మవరం), నిఖిల (ప్రసన్నాయపల్లి), అనంతపురానికి చెందిన వైష్ణవి, హేమ, హరిత, స్టాండ్‌బైలుగా విడపనకల్లుకు చెందిన పి.అమృత, బి.అమృత, శ్రీలేఖ (ఖాదర్‌పేట) ఎంపికయ్యారు. అలాగే పురుషుల జట్టులో వెంకటేశులు (బండమీదపల్లి), నారాయణస్వామి (మల్లాపురం), మహబూబ్‌బాషా (ముదిగుబ్బ), అశోక్ (కనగానపల్లి), గోవర్ధన్ (ధర్మవరం), శ్రీనాథ్ (ఇసురాళ్లపల్లి), సునీల్(ఇసురాళ్లపల్లి), అనిల్ (నారాయణపురం), బాలాజీ (వెంకటగిరిపాలెం), పురుషోత్తం (పెద్దకోట్ల), స్టాండ్ బైలుగా ధనుంజయ (మర్తాడు), రవి(బండమీదపల్లి), హరీష్(అనంతపురం), అశోక్ (కిష్టిపాడు) చోటు దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ కమిటీ కన్వీనర్ ఈశ్వరయ్య, అధ్యక్ష, కార్యదర్శులు గౌస్ మొహిద్దిన్, ఎస్.వెంకటేసులు అభినందించారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'అనంత'



ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన అనంతపురం జట్టు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలుర ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. ఈ పోటీలు విజయవాడ శివారులోని కానూరు అనుమోలు ప్రభాకరరావు మైదానంలో ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో 23 జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో 5–0 తేడాతో కృష్ణా జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. మొదటి మూడు స్థానాలు దక్కించుకున్న జట్లలోని క్రీడాకారులకు పతకాలను నిర్వాహకులు అందజేశారు. విజేత జట్టు క్రీడాకారులు, కోచ్‌లు ఆనంద్, మారుతీని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేష్ అభినందించారు.

'అపూర్వ' సమ్మేళనం




నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కూడేరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సందడి నెలకొంది. 1991–92లో 10వ తరగతి చదివిన విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో మొదలైన ఈ కార్యక్రమంలో ఎంతో కోలాహలంగా సాగింది. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి ఉపాధ్యాయులు దస్తగిరి, అంజినరెడ్డిని ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తాము ఏయే రంగాల్లో స్థిరపడ్డారు. వారి కుటుంబాల పరిస్థితిని వివరించారు. భోజనాల అనంతరం ఆటపాటలతో సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.

నేటి 'స్పందన' రద్దు

అనంతపురం సెంట్రల్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తూ వస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈ సోమవారం రద్దు చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్పీ జగదీష్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని గమనించి సెప్టెంబర్ 2న నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో పెరుగుతున్న నీటి మట్టం



బెళుగుప్ప: శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి ఎత్తిపోతల ద్వారా ఇన్‌ఫ్లో పెరగడంతో జీడిపల్లి రిజర్వాయర్‌లో క్రమంగా నీటి మట్టం పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 1.67 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 1.265 టీఎంసీలకు చేరుకుంది. ఎత్తిపోతల పంపుహౌస్‌ల ద్వారా ప్రస్తుతం 1,076 క్యూసెక్కుల నీరు జీడిపల్లి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది.

ఐటీఐలో రేపు జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ ప్రిన్సిపాల్ రామమూర్తి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం సమీపంలోని అమర్‌రాజా ఎనర్జీ మొబిలిటీ లిమిటెడ్ కంపెనీలో టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయనున్నారు. ఐటీఐ పూర్తి చేసిన వారితో పాటు చివరి సంవత్సరం పరీక్షలు రాయబోతున్న విద్యార్థులూ అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతితో పాటు నెలకు రూ. 14 వేలు వేతనం చెల్లిస్తారు. పూర్తి వివరాలకు 88868 85173లో సంప్రదించవచ్చు.

నా ట్రాక్టర్లనే పట్టుకుంటారా?

- ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నేత హల్‌చల్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రాప్తాడురూరల్: 'ఎంత ధైర్యం నీకు... నా ట్రాక్టర్లనే పట్టుకుంటావా?. నేనెవరునుకుంటున్నావ్? మా పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎంత కష్టపడ్డానో నీకేం తెలుసు. ఎవరితో ఫోన్ చేయించాలో చెప్పు... ఎలా వదలిపెట్టరో చూస్తా' అంటూ ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలానికి చెందిన టీడీపీ చోటా నేత హల్‌చల్ చేశాడు. వివరాలు... బత్తలపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత కేశవ... చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా అనంతపురం నగరానికి తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లి క్రాస్‌లో ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ వన్నూరురెడ్డి, కానిస్టేబుళ్లు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న కేశవ ఏకంగా స్టేషన్‌కు చేరుకుని సిబ్బందిపై చిందులు వేశారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

- యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలంటూ ప్రభుత్వాన్ని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యూఈఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.సూరిబాబు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా సెప్టెంబరు 5న తిరుపతిలోని సీఎండీ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నబి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధర్నా పోస్టర్లను సూరిబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, నాయకులు విడుదల చేశారు. అనంతరం సూరిబాబు మాట్లాడారు. విద్యుత్ శాఖకు సంబంధించి మూడు డిస్కంల పరిధిలో 23,500 మంది పనిచేస్తున్నారన్నారు. ఇందులో పీస్ రేట్ కార్మికులు, మీటర్ రీడర్లు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్పీఎం హమాలీలు, ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కార్మికులు 6 వేల మంది ఉన్నారన్నారు. అలాగే ట్రాన్స్‌కో, జెన్‌కో పరిధిలోని మూడు డిస్కమ్‌లలో 17,500 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరందరికీ వేతనాలు చెల్లిస్తున్న థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే కార్మికులందరికీ జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా రిక్రూట్ చేసిన షిఫ్ట్ ఆపరేటర్లకు ఇప్పటికే పనిచేస్తున్న కార్మికులతో సమానంగా వేతనం ఇవ్వాలన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతీకుమార్, నాయకులు రామచంద్ర, మధు, మహబూబ్‌బాషా, ఎస్‌కెఎం బాషా, నాగభూషణరెడ్డి, గంగాధర్, ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి బీబీ జైనబ్బీ దర్గా ఉత్సవాలు



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న బీబీ జైనబ్బీ దర్గా

ఉరవకొండ: భక్తుల కొంగుబంగారంగా పాక్‌దామన్ హజరత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ అమ్మవారు విరాజిల్లుతున్నారు. ఉరవకొండలోని బీబీ జైనబ్బీ దర్గాను సంతానం లేని జంటలు, పెళ్లి కానీ యువతీ, యువకులు వారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుంటే సంతాన ప్రాప్తితో పాటు కల్యాణం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. దర్గాలో అపురూప శిల్పకళ ఆకట్టుకుంటుంది. అరబ్ దేశంలోని పవిత్ర మక్కా ప్రాంతంలో ఏర్పాటు చేసిన జన్నత్‌కా దర్వాజ (స్వర్గద్వారం)ను పోలిన కట్టడాన్ని కర్ణాటక కళాకారులతో ఇక్కడ ఏర్పాటు చేశారు. గుల్బర్గా ఖాజా బందే నవాజ్ దర్గా తరహాలో ఇక్కడ గాజు గోపురాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. అజ్మీర్‌లో ప్రసిద్ధిగాంచిన ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గా తరహాలో భారీ దేగ్‌ను దర్గాలో ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో అమ్మవారి దర్గా ఆకర్షిస్తుంది.

ఈ నెల 28 నుంచి ఉరుసు ఉత్సవాలు..

బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 28న ప్రారంభమవుతాయని దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా తెలిపారు. 28న అమ్మవారి గంధం వేడుకలు, 29న ఉరుసు, 30న జియారత్ వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఖవ్వాలీ పోటీదారుడు రైస్ అనీస్‌శబరి ఈ నెల 30న జరిగే ఖవ్వాలీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళా సంఘాల లీడర్లకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రధానమంత్రి ధ్యేయమని ఏపీఎం అనసూయమ్మ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని రుద్రమదేవి మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల లీడర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి చేపట్టిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆదాయం కోసం కాకుండా స్థిరమైన జీవనోపాధి వనరులను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం సంఘాలను సక్రమంగా నిర్వహించుకునే సంఘాలకు ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీసీలు నరసింహమూర్తి, రమేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.20 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.20 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత నుంచి రూ.2,00,250 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, గేదెలు, ఎద్దుల సంత ద్వారా రూ.1,20,400 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

బాట మారెమ్మకు పూజలు

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో బాట మారెమ్మ

విశ్వసేవా మందిరానికి భూమిపూజ



రామకృష్ణుల విశ్వసేవా మందిరం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీరామ కృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో నిర్మాణం కానున్న శ్రీరామకృష్ణుల విశ్వసేవా మందిరం నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీధరమూర్తి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో చిన్మయా మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతీ ప్రత్యేక పూజలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సామాజిక సేవాకార్యకర్త రవికాంత్ రమణ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. రామకృష్ణ సేవా సమితికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు రామకృష్ణుల చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు శ్రీకృష్ణశశి, వేణుగోపాల్, వేదాద్రి ప్రవీణ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆద్యలక్ష్మికి బాలకోదండ పురస్కారం



ఆద్యలక్ష్మికి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నాలుగేళ్లకే కూచిపూడి నృత్యకళలో అపార ప్రతిభ కనపరుస్తూ పలు రాష్ట్రీయ, జాతీయ వేదికలపై ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న చిన్నారి ఆద్యలక్ష్మి బాలకోదండ రామకృష్ణ పురస్కారం అందుకుంది. వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట క్షేత్రంలో ప్రగతి నృత్య కళా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక సంబరాల్లో ఆద్యలక్ష్మి నాట్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. బాల కోదండ పురస్కారంతో పాటూ శిక్షణనిస్తున్న గురువు రమ్యకృష్ణను ఘనంగా సత్కరించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు వేదాంతం రాధేశ్యాం తదితరులు ఆద్యలక్ష్మి ప్రతిభను కొనియాడారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార సంఘటన తలుచుకుంటే చాలా భయమేస్తుంది. ఆస్పత్రుల్లో రాత్రి పూట కూడా వైద్య సేవలు అందించే మహిళా సిబ్బందికి ప్రభుత్వం సరైన రక్షణ కల్పించాలి. ఆస్పత్రి ఆవరణల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పోలీస్ సిబ్బంది రాత్రి వేళల్లో గస్తీలు పెంచాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణకు చట్టాలు ప్రవేశపెట్టాలి.

– ఎలిజబెత్ రాణి, స్టాఫ్‌నర్స్, పీహెచ్‌సీ, కనగానపల్లి





ఉన్మాదులను శిక్షించాలి

నిరుపేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో వైద్య వృత్తిని ఎంచుకున్న కోల్‌కతాలోని విద్యార్థిని హత్య చేయడం చాలా బాధాకరం. ఆసుపత్రిలో రోగుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు ఎంతో కష్టపడతారు. ఇటీవల కాలంలో ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బందిపై దాడులు పెరిగిపోతున్నాయి. విధుల్లో ఉన్న మహిళా వైద్యులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలి. హత్యాచారాలకు పాల్పడుతున్న ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి. జైల్లో పెట్టి ఉరి తీయాలి.

– అరుణ, హెల్త్ సూపర్‌వైజర్, రాప్తాడు

ఇస్కాన్‌కు కృష్ణాష్టమి శోభ



లలిత కళాపరిషత్తులో కృష్ణుడు, గోపిక వేషధారణ

అనంతపురం కల్చరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఇస్కాన్ మందిరం బృందావనంగా మారింది. మూడు రోజుల పాటూ ముచ్చటగా సాగే వేడుకల్లో ఆదివారం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు బారులు తీరి రాధా పార్థసారథులను దర్శించుకున్నారు. ఇస్కాన్ ఇన్‌చార్జి దామోదర గౌరంగ దాసు నేతృత్వంలో తెల్లవారుజామునే వేడుకలు రాధాకృష్ణులకు మంగళహారతితో ప్రారంభమయ్యాయి. ఉదయం నల్లనయ్యకు పంచామృతాభిషేకం, అలంకార సేవలు, గురుపూజ, విశ్వశాంతి యజ్ఞం, సాయంత్రం తులసి అర్చన హనుమద్ సేవ భక్తిశ్రద్ధలతో జరిగాయి. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన మందిర ప్రాంగణంలో భక్తులు ఆనంద తాండవం చేశారు. ముఖ్యంగా ఇస్కాన్ సభ్యులు 'హరే కృష్ణ' నామస్మరణతో భక్తిగీతాలకు నాట్యం చేశారు. చిన్నారి కృష్ణుల వేషధారణలతో పాటు మహిళలు కోలాటాలతో శ్రీకృష్ణుడికి భక్తితో నీరాజనాలర్పించారు. పలువురు అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల సేవలు ఘనంగా జరిగాయి. నిర్వాహకులు మాట్లాడుతూ.. సోమవారం మహా పుష్పాభిషేకం ఉంటుందని అందరూ తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న 'సాయి గోకులం'

అనంతపురం కల్చరల్: సాక్షాత్తు రేపల్లెను తలపించేలా చిన్ని కృష్ణులు, చిన్నారి గోపికలు అనంత వాసులను ఆకట్టుకున్నారు. ఆదివారం రాత్రి నగరంలోని లలిత కళాపరిషత్తులో 'సాయి గోకులం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సంప్రదాయ చిన్ని కృష్ణుల వేషాలను వేయించి వారితో కలిసి నాట్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా శ్రీ కృష్ణతులాభారం, ఉట్టి ఉత్సవం, శయనోత్సవం, వెన్నదొంగాట అలరించాయి. ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్య బృందం కృష్ణాష్టమి పర్వదినం ఉట్టిపడేలా సంప్రదాయ గీతాలపై ఆటపాటలు, కోలాటం నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లలితా కళాపరిషత్తు కళాకారులు, సాయిట్రస్టు ప్రతినిధులు విజయ్ కుమార్, రాఘవేంద్ర, నారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీల కేంద్రంలో సిస్టర్ శారదా నేతృత్వంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎంపీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్దీప వెలుగుల్లో ఇస్కాన్ మందిరం



నృత్యం చేస్తున్న కృష్ణుడు, గోపిక వేషధారులు



కోలాటం ఆడుతున్న మహిళలు



ఇస్కాన్ మందిరం వద్ద సెల్ఫీ దిగుతున్న యువతులు



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు



విశ్వశాంతి హోమం చేస్తున్న అర్చకులు

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: నామినేటెట్ పదవుల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పించాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాయలసీమ పొలిటికల్ అడ్వైజరీ చైర్మన్ వంకదారు వెంకట కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తూరు అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సంఘం ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ పదవిని అనంతపురం నగరానికి కేటాయించాలని కోరారు. కార్పొరేషన్‌కు అత్యధిక నిధులు కేటాయించి ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకట కృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు శిరిగుప్ప వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి మనోజ్, ఉపాధ్యక్షుడు నాగభూషణం, నాయకులు సత్రశాల మంజునాథ్, సత్య రంగయ్య, భూమా బాలసుబ్రహ్మణ్యం, తాటి మధు తదితరులు పాల్గొన్నారు.

28న కొల్హాపూర్ అమ్మవారి వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమ ప్రాంగణంలో కొలువుదీరిన కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 28న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ తెలిపారు. మహాగణపతి పూజలు, శ్రీలక్ష్మీ నారాయణ హోమం, దేవతామూర్తుల అభిషేకాలతో పాటూ 11 మంది మహిళలకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే టోకెన్లు తీసుకున్న వారు సకాలానికి విచ్చేసి తీర్థప్రసాదాలు అందుకోవాలని సూచించారు. అదేవిధంగా స్వామి అక్కల్‌మహారాజ్ , భక్తాంజనేయస్వామి, నాగదేవతల ప్రతిష్ట అదే రోజున జరిగినందున వార్షికోత్సవ వేడుకల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

29న తెలుగు భాషా దినోత్సవం

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) ఆధ్వర్యంలో ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవ వేడుకలు–2024 నిర్వహించనున్నట్లు ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.హనుమేష్, జి.తులసిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు సి.ఎర్రిస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, సాహిత్య పరీక్ష, చిత్రలేఖనం, పద్యధారణ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులతో పాటు తెలుగు పండితులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యోగి మీలా రేప జయంతి

అనంతపురం కల్చరల్: టిబెట్ యోగి మీలా రేప జయంతిని పలు యోగా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ నిర్మల ముఖ్య అతిథిగా విచ్చేసి యోగా ప్రాధాన్యతను వివరించారు. ఎంతో మంది భారతీయయోగులు విశ్వానికి చూపెట్టిన మార్గాన్ని టిబెట్ యోగులు అనుసరించి మెరుగులు తీర్చిదిద్దారన్నారు. సత్యాన్వేషణ మార్గం ఉన్నత జీవితానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా యోగా అభ్యసిస్తున్న ఓ కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. అలాగే బెంగళూరు రోడ్డులోని ధ్యానకేంద్రం, సత్యసాయి యోగా కేంద్రం తదితర వాటిల్లో మీలా రేప జయంతి వేడుకలు జరిగాయి.

వినాయక చవితి ఉత్సవాలకు నేడు భూమిపూజ

అనంతపురం కల్చరల్: నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగే సప్తగిరి సర్కిల్‌లో శ్రీగణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగే వినాయక ఉత్సవాలకు సోమవారం ఉదయం 7 గంటలకు భూమి పూజ ఉంటుందని నిర్వాహకుడు మేదర వేణుగోపాల్ తెలిపారు. భక్తులు దత్తమందిరం ఎదురుగా సాగే భూమిపూజలో పాల్గొనాలని కోరారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు



మాట్లాడుతున్న వివేకానంద యోగా కేంద్రం నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ జిల్లా స్థాయి యోగా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక షిర్డీ నగర్‌లోని వివేకానంద యోగా భవన్ వేదికగా మెళవాయి రాజశేఖరరెడ్డి అధ్యక్షతన సాగిన పోటీల్లో 150 మంది పిల్లలు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసి యోగా గురువుల ముందు ప్రతిభను చాటుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. సెప్టెంబర్ మాసంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఇందులో గెలుపొందిన వారిని పంపిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి యోగా ప్రాధాన్యతను తెలియజేశారు. ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్న యోగా కేంద్రం వారిని అభినందించారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. వేర్వేరు విభాగాల్లో జరిగిన పోటీల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన యోగా గురువులు మారుతీ ప్రసాద్, తారక్, కృష్ణ, విశ్రాంత ఆర్డీఓ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



అశ్వర్థ నారాయణ స్వామికి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు హనుమంత రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, వెంకట్రామి రెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణ రెడ్డి, నారాయణ స్వామి, మధుసూదన గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తొలుత స్వామికి గులాబీలతో మాల, నవగ్రహ పూజ, విష్ణుపూజ, లక్ష్మీ పూజ, హోమం చేపట్టారు. ఉదయం 10 గంటలకు వేద పండితులు నాగరాజు స్వామి, శ్రీకాంత్ స్వామి తదితరులు అశ్వర్థ నారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రాల నడుమ ఆలయంలో స్వామి వారికి కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఎక్కడ స్వామి వారి కల్యాణాలు జరుగుతాయో, అక్కడ కరువు కాటాకాలకు తావుండదని.. ఆ ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురుస్తూ పాడి పంటలు పచ్చగా ఉంటాయని పండితులు తెలిపారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయంలో నాగులకట్టకు క్షీరాభిషేకం నిర్వహించారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

శ్రావణ మాసం మూడో ఆదివారం మండల పరిధిలోని పలు ఆలయాలు, నాగుల కట్టల దగ్గర ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రాప్తాడులోని ఇటుకుల పల్లయ్య స్వామి, పండమేటి వేంకటరమణ స్వామి, నిలకంఠేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, హంపాపురంలోని 39 అడుగుల ఆంజనేయస్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు తెల్లవారుజాము నుంచే స్నానాలు చేసి ఉపవాస దీక్షలు చేపట్టారు. స్వాములను ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, లలిత సహస్రనామ, కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. మహిళా భక్తులు నాగులకట్ట వద్దకు చేరి పాలు పోశారు. అలాగే పుల్లలరేవులో చెన్నకేశవ స్వామి, ప్రసన్నాయపల్లిలో శివుడు, పెద్దమ్మ, రాప్తాడులో మారెమ్మ, పెద్దమ్మ, ముత్యాలమ్మ, బుక్కచెర్లలో నల్లలమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

నిరుపయోగంగా సంక్షేమ వసతి గృహాలు



మరూరు బీసీ బాలుర వసతి గృహం

రాప్తాడు: మండలంలో మరూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఉన్న బీసీ బాలుర వసతి గృహం, గొందిరెడ్డి పల్లి గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహం నిరుపయోగంగా మారాయి. గతంలో ఇక్కడ పని చేసిన వార్డెన్లు తమ స్వార్థం కోసం విద్యార్థులు చేరకుండా హాస్టళ్లు మూతపడడానికి కారకులయ్యారనే విమర్శలున్నాయి. అన్ని వసతులు ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకోకపోవడంతో స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. హాస్టల్ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వసతి గృహాలపై ఉన్నతాధికారుల సర్యవేక్షణ కొరవడటంతో వసతి గృహంలోని తలుపులు, కిటికీలు చెక్కలతో పాటు ఐరన్, తదితర సామగ్రిని కూడా గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్తున్నట్లు సమాచారం. కనీసం భవనాలను రైతులకు ధాన్యం గోడౌన్‌ల కింద అప్పగించినా పంచాయతీకి కొంత మేర ఆదాయం వస్తుంది. ఆ ప్రాంతం అంతా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసే బాధ్యత గ్రామం తీసుకుంటుందంటూ గ్రామస్తులు సూచిస్తున్నారు.

ఉపాధిహామీ సిబ్బందికి రూ.21వేల జరిమానా

కణేకల్లు: ఉపాధిహామీ కూలీల మస్టర్‌లో తప్పిదాలతోపాటు రికార్డుల్లో పనులు, బిల్లుల చెల్లింపు వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఉపాధిహామీ సిబ్బందికి అదనపు పీడీ ఆర్.సుధాకర్‌రెడ్డి రూ.21 వేలు ఫెనాల్టీ వేశారు. అదేవిధంగా వివిధ పనుల్లో బిల్లుల చెల్లింపుల్లో లెక్కల్లో తప్పిదాలుండడంతో రూ.19,756లు రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి డ్వామా ఏపీడీ ఆర్.సుధాకర్‌రెడ్డి, రాయదుర్గం ఏపీడీ అయిషా, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించిన డీఆర్పీ, విలేష్ సోషల్ ఆడిటర్లు తనిఖీల్లో వెలుగు చూసిన విషయాలను ప్రజావేదికలో వెల్లడించారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్ స్కీమ్ కింద రైతుల పొల్లాల్లో నాటిన మొక్కలు డ్రై అయినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. రచ్చుమర్రిలో ముగ్గురు రైతుల పొలాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద 1,170 మొక్కలు నాటితే కొన్ని నెలలకే ఎండిపోయాయని డీఆర్పీ ప్రమీళ అధికారుల దృష్టికి తెచ్చారు. జక్కలవడికిలో ఓ రైతు పొలంలో 139 మొక్కలు నాటారని, అవి కూడా ఎండిపోయినట్లు డీఆర్పీ చంద్రకళ తెలియజేశారు.

యువకుడి ఆత్మహత్య

గుత్తి: పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో నివాసముండే సోమశేఖర్ (27) ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. సోమశేఖర్ ఓ హోటల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి దూలానికి ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలంలో సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. తన చావుకు ఎవరూ కారణం కాదని, 'అమ్మా నన్ను క్షమించు నిన్ను వదిలి పోతున్నా' నోట్‌లో రాశాడు. తాను మేనేజర్‌గా పని చేసే హోటల్ నిర్వాహకులు తనకు ఐదు లక్షలు డబ్బు ఇవ్వాల్సి ఉందని, హోటల్ నిర్వాహకులు తన కుటుంబ సభ్యులకు ఆ డబ్బు ఇవ్వాలని సూసైడ్ నోట్‌లో రాశాడని పోలీసులు చెప్పారు. ఎస్‌ఐ నబీ రసూల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడి ఆనంద్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపురానికి చెందిన ఆనంద్ అనే యువకుడు గుంతకల్లు మండలంలోని వైటీ.చెరువులో బంధువుల వివాహ వేడుకకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. రజాపురం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను స్థానికులు 108లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా అన్నాభిషేకం





అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు, మంజునాథ స్వామి

ఆత్మకూరు: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మండలం పంపనూరులో వెలసిన సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తుల కార్తికేయ నామస్మరణ మధ్య సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మంజునాథస్వామి మూలవిరాట్‌లను అన్నంతో అభిషేకించారు. పార్వతీదేవికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు జరిగాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ మర్యాదలతో ఈఓ అక్కిరెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.